


రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది నరసన్న ఆలయంలో నిత్యాన్నదానానికి పులెపు త్రిమూర్తులు, అనంతలక్ష్మి దంపతులు (నరసాపురం) బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు.



డెల్టాకు 5,800 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 5,800 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 7.75 అడుగుల నీటి మట్టం కొనసాగుతోంది.

గరిష్టం/కనిష్టం
42.0° / 25.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	25.0
కాకినాడ	39.9	27.1
అమలాపురం	41.0	25.0

న్యూస్‌రీల్

నేడు ప్రవేశ పరీక్షలు

అమలాపురం టౌన్: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాల కోసం అమలాపురంలోని మూడు కేంద్రాల్లో గురువారం ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎం.కమలకుమారి, జిల్లా కో ఆర్డినేటర్ డీఎస్‌బీ శంకరరావు తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతులలో అడ్మిషన్ల కోసం అమలాపురంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (ఏపీ ఆర్జేసీ), ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ (ఏపీ ఆర్‌డీసీ) ప్రవేశాలకు అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, వెత్సావారి అగ్రహారం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకూ పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని అమలాపురం డివిజన్ విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం సూచించారు. మరిన్ని వివరాలకు 87126 25030 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సీవీజీల్‌కు 480 ఫిర్యాదులు



సీపీవో వెంకటేశ్వర్లు

అమలాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఇప్పటి వరకూ సీవీజీల్ యాప్‌కు 480 ఫిర్యాదులు అందినట్లు సీపీవో వెంకటేశ్వర్లు తెలిపారు. గత నెల 16 నుంచి ఈ నెల 23 వరకూ వచ్చిన ఈ ఫిర్యాదులలో 94 వాటిని ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించినవి కావని ధ్రువీకరించామన్నారు. మిగిలిన 386 ఫిర్యాదులను వంద నిమిషాలలోపు, 37 ఫిర్యాదులను వంద నిమిషాలు పైబడిన తర్వాత పరిష్కరించామన్నారు. వెలగపూడిలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ద్వారా జిల్లాకు సంబంధించి గత నెల 16వ నుంచి ఈ నెల 23 వరకూ 33 ఫిర్యాదులు రాగా, వాటిన్నంటినీ పరిష్కరించినట్టు తెలిపారు.

విద్యా వికాసం

- **కోనసీమలో విద్యాకాంతులు**
- **పాఠశాలలకు మహర్దశ**
- **అంగన్‌వాడీ నుంచి విదేశీ విద్య వరకూ ప్రభుత్వ ప్రోత్సాహం**
- **విద్యార్థులకు అన్ని వసతులు**
- జగన్ పాలనలో చదువుకు ప్రాధాన్యం

సాక్షి అమలాపురం: నాశిరకం దుస్తులు, పెచ్చులూడుతున్న గోడలు, వర్షం నీరు కారే శ్లాబ్‌లు, కంపుకొట్టే మరుగుదొడ్లు, చెక్కలు విరిగిన బోర్డులు.. ఇవి ప్రభుత్వ పాఠశాలలు అనగానే గతంలో గుర్తుకు వచ్చేది. ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల సాంబారు, వారానికి రెండుసార్లు గుడ్డు, కానరాని ఆధునిక విద్యాబోధన. అంగన్‌వాడీ కేంద్రాలైనా, పాఠశాలలలైనా, వసతి గృహాలైనా, ఇంటర్, డిగ్రీ కాలేజీలు అన్నా ఇంచుమించు ఇదే స్థితి. ఇదంతా గతం. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

ఆకట్టుకునేలా..

సువిశాలైన పాఠశాల ప్రాంగణాలు, రంగురంగుల బొమ్మలు అద్దిన గోడలు, ఆకట్టుకునే నాణ్యమైన యూనిఫాం, పటిష్టమైన శ్లాబ్‌లు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, అధునాతన బ్లాక్, డిజిటల్ బోర్డులు, విద్యార్థుల చేతిలో ట్యాబ్‌లు, ఇంగ్లిషులో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులు, ఆధునిక విద్యాబోధన, వారంలో ఐదు రోజుల పాటు గుడ్డు, నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారం.. ఇది ఇప్పుడున్న ప్రభుత్వ పాఠశాలల తీరు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మెరుగైన వసతులతో ప్రభుత్వ విద్యావ్యవస్థ కళకళలాడుతోంది. వీటికి తోటు అమ్మఒడి, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, విదేశీ విద్య వంటి ప్రోత్సాహకాలు ఏటా క్రమం తప్పకుండా తల్లుల ఖాతాలో వచ్చిపడుతున్నాయి. చేతిలో సొమ్ములు, పాఠశాలల్లో సదుపాయాలు, పౌష్టికాహారం, ఆధునిక బోధన తదితర మార్పులు గడచిన ఐదేళ్లుగా విద్యావ్యవస్థలో చోటు చేసుకున్నాయి.



ద్రాక్షారామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ విద్యా బోధన



ముమ్మిడివరం మండలం అనాతవరం ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌లతో విద్యార్థులు

జిల్లాలో అమలైన విద్యాపథకాలు

- మనబడి నాడు – నేడు పథకం ఫేజ్ –1లో జిల్లాలోని 436 పాఠశాలలను రూ.104.96 కోట్లతో అభివృద్ధి చేశారు. ఫేజ్ –2లో 761 పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.257 కోట్లు మంజూరు కాగా, పనులు కొనసాగుతున్నాయి. నాడు – నేడుతో పనులు చేయడమే కాకుండా స్కూల్ మెయింటినెన్స్ ఫండ్ (ఎస్ఎంఎఫ్) ద్వారా పాఠశాలల్లో చిన్నచిన్న పనులకు రూ.27.76 కోట్లు విడుదలయ్యాయి.
- 2019 – 20 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15 వేలు అందజేస్తున్నారు. దీని ద్వారా ఏడాదికి సగటున 1.45 లక్షల మంది విద్యార్థులకు మేలు జరిగింది. జిల్లాలో ఈ ఐదేళ్లలో రూ.822.86 కోట్ల లబ్ధి చేకూరింది.
- జగనన్న గోరుముద్ద పథకం ద్వారా జిల్లాలోని 1,573 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 1,05,698 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. వారానికి ఐదు రోజులు కోడిగుడ్డు, మూడు రోజుల 25 గ్రాముల బరువు ఉన్న చిక్కీ, మిగిలిన మూడు రోజులు రాగిజావ అందజేస్తున్నారు.
- పాఠశాలల్లో పారిశుధ్య కార్యక్రమాలకు 1,689 మందిని శానిటేషన్ ఆయాలుగా నియమించి నెలకు రూ.ఆరు వేలు జీతంగా అందజేస్తున్నారు.
- జగనన్న విద్యా కానుక ద్వారా మూడు జతల యూనిఫాం, నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, రెండు జతల సాక్స్, ఒక జత షూ, బెల్ట్, స్కూల్ బ్యాగ్, డిక్షనరీ అందజేస్తున్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో జిల్లాలో 1,14,833 మంది విద్యార్థులకు ఈ కిట్ అందించారు.
- జిల్లాలోని ఏడుగురు విద్యార్థులు ఈ ఏడాది జగనన్న విదేశీ విద్య పథకానికి ఎంపికయ్యారు. వీరికి రూ.62,64,256 మంజూరైంది. ఈ విద్యా సంవత్సరానికి గొల్లమందల సంజయ్ అనే విద్యార్థి మాస్టర్ ఆఫ్ సైన్స్ విద్యను అమెరికాలో అభ్యసించేందుకు రూ.39,28,580 ప్రభుత్వం మంజూరు చేసింది. రాజోలు మండలం పొన్నమండకు చెందిన తోరం ప్రశాంతి మౌనికకు రూ.17,81,272 విదేశీ విద్యకు అందజేశారు.
- జగనన్న వసతి దీవెన పథకంలో భాగంగా రూ.16,85,42,500లను విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేశారు.
- జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా 2022 మే నుంచి ఈ ఏడాది మార్చి వరకు 67,145 మంది విద్యార్థులకు రూ.49,25,42,518 పంపిణీ చేశారు.
- జిల్లాలోని 142 పాఠశాలకు 945 ఇంటరేక్టివ్ ఫ్లాట్ ఫ్యానల్స్ (ఐఎఫ్‌పీ)లు అందించారు. ఒక్కొక్క దాని ఖరీదూ రూ.1.25 లక్షలు. దీని ద్వారా డిజిటల్ బోధనతో పాటు పాఠాలను డౌన్‌లోడ్ చేసుకుని కూడా చెప్పే అవకాశం అధికంగా ఉంది.



అమలాపురం బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డెస్కులు

నామినేషన్ల కోలాహలం

- అట్టహాసంగా తోట త్రిమూర్తులు నామినేషన్
- టీడీపీ రెబల్‌గా శ్యామ్
- హరీష్ ర్యాలీలో నిబంధనల ఉల్లంఘన

సాక్షి అమలాపురం: వైఎస్సార్ సీపీ మండపేట అసెంబ్లీ అభ్యర్థిగా తోట త్రిమూర్తులు బుధవారం నామినేషన్ వేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీ నిర్వహించారు. మండపేట తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్లారావుకు రెండు సెట్ల నామినేషన్లు అందజేశారు. ఆయనతో పాటు తనయుడు తోట పృథ్వీరాజ్ కూడా రెండు సెట్లు అందించారు. తొలుత పట్టణంలోని విజయలక్ష్మి నగర్‌లో గల పార్టీ కార్యాలయం వద్ద నుంచి త్రిమూర్తులు బయలుదేరారు. ఆయనతో పార్లమెంట్ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావు కూడా ఉన్నారు. పార్టీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదకు, అక్కడ నుంచి రాజారత్నం సెంటర్, బస్టాండ్, కలువపువ్వు సెంటర్ మీదుగా ర్యాలీ సాగింది. జై జగన్, జై తోట నినాదాలతో హోరెత్తించారు. ముస్లింలు గజమాలతో సత్కరించారు. ర్యాలీకి వచ్చిన అభిమానులు, కార్యకర్తలలో రోడ్లు కిక్కిరిసిపోయాయి. డప్పు వాయిద్యాలు, బాణాసంచా కాల్పులు, తీన్‌మార్‌లతో ఊరేగింపు సాగింది. తోట నామినేషన్ వేసిన సమయంలో ఆయన వెంట రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి, మున్సిపల్ చైర్మన్ పతివాడ నూక దుర్గారాణి ఉన్నారు.



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు



వేంకటేశ్వరస్వామి ఆలయంలోకి జెండాలతో ప్రవేశించిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

ఆరోరోజు 52 మంది నామినేషన్లు

సార్వత్రికి ఎన్నికలకు సంబంధించి ఆరోరోజు బుధవారం నామినేషన్ల పర్వం కోలాహలంగా సాగింది. ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్రులుగా 52 మంది అభ్యర్థులు 63 సెట్ల నామినేషన్‌లు పత్రాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు.

అమలాపురం పార్లమెంట్‌కు..

జంగా గౌతమ్ (కాంగ్రెస్), గిడ్డి జ్ఞాన ప్రకాశరావు (రిపబ్లిక్ పార్టీ), యాలంగి రమేష్ (జై భీమ్‌రామ్), కాత్రు నాగబాబు (తెలుగు నవగర్జన), గంటి హరీష్ మాధుర్ (టీడీపీ), మాకే దేవీ ప్రసాద్ (స్వతంత్ర), కాప కల్యాణ్ (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్) నామినేషన్లు అందించారు.

టీడీపీ రెబల్‌గా పరమట శ్యామ్

అమలాపురం అసెంబ్లీ నుంచి టీడీపీ రెబల్ అభ్యర్థిగా పరమట శ్యామ్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. 2004 నుంచి టీడీపీ టిక్కెట్ ఆశిస్తున్నా పార్టీ అధిష్టానం మొండి చేయిచూపించింది. దీనికితోడు టిక్కెట్ ఇవ్వకున్నా కనీసం పార్టీ పెద్దలు కానీ, స్థానిక నాయకులు కూడా లెక్కచేయకపోవడంతో శ్యామ్ టీడీపీ రెబల్‌గా బరిలో దిగారు. ఆయన నామినేషన్‌కు టీడీపీ, జనసేనలలో ఒక వర్గం మద్దతుగా రావడం టీడీపీకి మింగుడు పడని అంశంగా మారింది.

నిబంధనల ఉల్లంఘన

అమలాపురం పార్లమెంట్ అభ్యర్థిగా గంటి హరీష్ నామినేషన్ వేసే కార్యక్రమంలో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారు. నామినేషన్‌లకు వెళ్లేముందు అమలాపురం స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలోకి పార్టీ నాయకులు, కార్యకర్తలు జెండాలతో ప్రవేశించారు. పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన డప్పులు వాయిస్తూ ఎన్నికల కోడ్‌కు ఉల్లంఘించారు. జాతీయ రహదారిపై గంటల పాటు రహదారి స్తంభింపచేయడంతో వాహనచోదకులు ఇబ్బందుల పాలయ్యారు. నల్లవంతెన వద్ద సైతం ట్రాఫిక్ నిలిచిపోవడంతో ద్విచక్ర, ఆటోలపై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు మండుతున్న ఎండలో అవస్థలు పడ్డారు.

నేటితో నామినేషన్ల గడువు పూర్తి

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గురువారంతో అసెంబ్లీ, పార్లమెంట్‌కు నామినేషన్‌ల ప్రక్రియ పూర్తి కానుంది. ప్రధాన పార్టీలైన వైఎస్సార్ సీపీ, మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన అభ్యర్థులు నామినేషన్లు ఇప్పటికే వేశారు. వీరికి మద్దతుగా వారి కుటుంబ సభ్యులు కూడా డమ్మీ నామినేషన్లు వేశారు. వీరితో పాటు కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీల తరపున, స్వతంత్రులుగా పలువురు నామినేషన్లు దాఖలు చేశారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా..

రామచంద్రపురం

వాసంశెట్టి సుభాష్ (టీడీపీ), కోట శ్రీనివాస రావు (కాంగ్రెస్), యర్రంశెట్టి వీర వెంకట సత్యనారాయణ రామరాజు, మడికి చంద్రశేఖర్‌లు (స్వతంత్ర).

ముమ్మిడివరం

పొన్నాడ వెంకట సతీష్ కుమార్, పొన్నాడ నీరజ (వైఎస్సార్ సీపీ), దాట్ల పార్వతీ దేవి (టీడీపీ), పాలెపు లక్ష్మీ (కాంగ్రెస్), మల్లాడ కృష్ణారావు (తెలుగు నవగర్జన), చీకురుమిల్లి రవికుమార్ (స్వతంత్ర), వాకపల్లి భీమారావు (బీఎస్పీ), రాగిరెడ్డి మహాలక్ష్మి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), దడాల రామకృష్ణ (రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా).

రాజోలు

సాకా వర ప్రసాదరావు (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), సరేళ్ల ఉషారాణి, సరెళ్ల ప్రసన్న కుమార్ (కాంగ్రెస్).

కొత్తపేట

బండారు సత్యానందరావు, బండారు కమలా రాణి (టీడీపీ), రౌతు ఈశ్వరరావు, రౌతు కాశీ విశ్వనాథం, దడాల చంద్రరావు (కాంగ్రెస్), సత్యాల అరుణ్ కిరణ్ (జై భారత్ నేషనల్ కాంగ్రెస్), ఇమ్మానియేలు కుమార్ (స్వతంత్ర), దడాల చంద్రరావు (లిబరేషన్ కాంగ్రెస్).

పి.గన్నవరం

ఖండవిల్లి సురేంద్ర (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), కొల్లాబత్తుల సత్యనారాయణ (బీఎస్పీ), గిడ్డి ఆనందరావు (స్వతంత్ర).

అమలాపురం

చిట్టిగూల్ల వీర వెంకట సత్యనారాయణ, పరమట శ్యాం కుమార్, బీరా రామారావు, వారసాల సత్యనారాయణ (స్వతంత్ర), అయితాబత్తుల కుమార్ సింగ్, అయితా బత్తుల సుభాషిని (కాంగ్రెస్), దేవరపల్లి రాజీవ్ (జై భారత్ నేషనల్ పార్టీ).

మండపేట

కోన సూర్య భాస్కరరావు, మార్ని సత్యనారాయణ, రాయుడు శ్రీనివాసరావు (స్వతంత్ర), కామన ప్రభాకరరావు, కామన సత్యవాణి (కాంగ్రెస్), తోట త్రిమూర్తులు, తోట పృథ్వీరాజ్ (వైఎస్సార్ సీపీ), వేగుళ్ల జోగేశ్వరరావు, వల్లూరు సాయికుమార్ (టీడీపీ), నల్లా చిన్నారావు (లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ)

క్లుప్తంగా

నేటి నుంచి తలుపులమ్మ ఉత్సవాలు



తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి (గంధామావాస్య) సంబరాలు గురువారం నుంచి మే ఎనిమిది వరకు జరుగుతాయని లోవ దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం ఉదయం 7.45 గంటలకు లోవ దేవస్థానంలో గరగలు సంబరం నిర్వహిస్తామన్నారు. అంతకు ముందు లోవ కొత్తూరు గ్రామంలో గతేడాది భద్రపర్చిన గరగలను లోవ దేవస్థానానికి తీసుకువచ్చి శుద్ధి చేస్తామన్నారు. అమ్మవారి చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. జాతరోత్సవాల సందర్భంగా వివిధ పౌరాణిక, జానపద, సాంఘిక నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గరగలను తీసుకువెళ్లి అమ్మవారికి ప్రచారం కల్పిస్తామన్నారు. మే 8వ తేదీన తీర్థం, అమ్మవారి ఊరేగింపు ఏర్పాటు చేశామన్నారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం తర్వాత తొలిసారిగా ఉత్సవాలను లోవ కొత్తూరు గ్రామంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

జామాయిల్ తోట దగ్ధం

గోపాలపురం: జామాయిల్ తోట కాలిపోయిన ఘటనలో సుమారు రూ.4 లక్షల నష్టం సంభవించింది. గోపాలపురం మండలం గుడ్డిగూడెం గ్రామ శివారులోని తోట రాజబాబుకు చెందిన మూడు ఎకరాల జామాయిల్ తోట బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తూ కాలిపోయింది. ఈ ఘటనలో సుమారు రూ. 4 లక్షల నష్టం జరిగింది. అలాగే తూతిగ రామకృష్ణ, గంగ్రోతు శ్రీరామమూర్తిలకు చెందిన సుమారు 50 మామిడి మొక్కలు, వరిగడ్డి వాము కాలిపోయాయి. వీటి నష్టం సుమారు రూ. రెండు లక్షలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

అభయారణ్యం.. ప్రకృతి సోయగం



కోరంగి అభయారణ్యం స్వాగత ద్వారం వద్ద పర్యాటకులు

- పర్యాటకులను ఆకట్టుకుంటున్న కోరంగి
- అలరిస్తున్న అందాలు
- సందర్శకులకు గొప్ప అనుభూతి

తాళ్లరేవు: సందర్శకులు, ప్రకృతి ప్రేమికులను కోరంగి అభయారణ్యం పిలుస్తోంది. విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో ప్రకృతి ఒడిలో చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆటపాటలతో సరదాగా గడిపే క్షణాలకు అభయారణ్యం వేదిక కానుంది. ప్రతి ఏటా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అనేక మంది పర్యాటకులు వేసవి సెలవుల్లో ఇక్కడకు వచ్చి సరదాగా గడుపుతారు. కోరంగి అభయారణ్యంలో ఉల్లాసంగా, ఉత్సాహంగా తిరుగుతూ ఉంటారు. ముఖ్యంగా మడ అడవుల్లో చెక్క వంతెనలపై నడుస్తూ, పక్షుల కిలకిలారావాలు, చెట్ల సౌందర్యం, పలు జంతువుల విన్యాసాలను తిలకిస్తూ పరవశించిపోతుంటారు. వాచ్ టవర్, బోట్లపై నుంచి మడ అడవుల అందాలు, సముద్రాన్ని చూసి మంత్రముగ్ధులవుతారు. అభయారణ్యంలో ప్రకృతిని ఆస్వాదిస్తూ అందరితో ఉత్సాహంగా గడపడం మరువలేని జ్ఞాపకంగా నిలుస్తుంది. ఈ మేరకు పర్యటకుల సౌకర్యార్థం తాగునీరు, తినుబండారాల దుకాణాలను అటవీ శాఖ ఏర్పాటు చేసింది. వీటితో పాటు పర్యాటకులకు మరింత అనుభూతినిచ్చేలా పలు నిర్మాణాలు చేపట్టారు.

ప్రత్యేక ఆకర్షణ

పర్యాటకులకు మరింత అనుభూతినిచ్చేందుకు రూ.25 లక్షలతో అభయారణ్యంలో విశేషాలను తెలియజేసే మినీ థియేటర్, మత్స్య, పక్షిజాతులను వీక్షించేలా అక్వేరియం, ప్రకృతి స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో సంచరించే మత్స్య జాతులను వీక్షించే విధంగా నూతనంగా భారీ ఎక్వేరియం నిర్మించారు. ఇది అభయారణ్యానికే ప్రత్యేక ఆకర్షణ కానుంది. వీటితో పాటు మడ అడవుల ప్రాముఖ్యతను తెలియజేసేలా డాక్యుమెంటరీని రూపొందించి మినీ థియేటర్‌లో పది నిమిషాలు ప్రదర్శించే విధంగా ఏర్పాట్లు చేశారు. వివిధ రకాల పక్షులను పర్యాటకులు చూసేలా ప్రత్యేక భారీ పంజరాలను పెట్టారు. వివిధ రకాల మొక్కలను ప్రదర్శించనున్నారు.



అభయారణ్యంలో విశేషాలను తెలియజేసే మినీ థియేటర్



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అక్వేరియం



పక్షులు, మొక్కలను వీక్షించేందుకు ఏర్పాటు చేసిన ప్రకృతి స్టాల్

అలరించే బోటు షికార్, క్రీక్ విజిట్

అభయారణ్యంలో పర్యాటకులకు బోటు షికారు ప్రత్యేక అనుభూతినిస్తుంది. ఏపీ టూరిజం, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ బోట్లపై గోదావరి పాయలో ప్రయాణించి సముద్రం కలిసే ప్రాంతానికి తీసుకువెళతారు. అక్కడి నుంచి మడ అడవుల అందాలతో పాటు, కాకినాడ సిటీ అందాలు పర్యాటకులను అలరిస్తాయి. మడ చెట్లపై సంచరించే వివిధ రకాలు పక్షులు, జంతువులు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటాయి. అదే విధంగా కేరళ తరహాలో మడ అడవుల్లో ఉండే చిన్నపాటి క్రీక్ (పిల్ల కాలువలు)లలో పర్యాటకులు బోట్లపై తిరిగేలా క్రీక్ విజిట్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. బోటుపై విహరిస్తూ అభయారణ్యం అందాలను ఆస్వాదించడం మరచిపోలేని అనుభూతినిస్తుంది.

కన్నుల పండువగా శ్రీపుష్పోత్సవం

- ముగిసిన కల్యాణోత్సవాలు
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి



వాడపల్లి ఆలయంలో స్వామివారి పల్లకీ ఊరేగింపు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి శ్రీ పుష్పోత్సవం బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. దీనితో ఆలయంలో జరుగుతున్న కల్యాణోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా వాడపల్లి ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, బాలభోగం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి భక్తుల గోవింద నామస్మరణ నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. వైఖానస పండితుడు శ్రీమాన్ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక స్వాములు శ్రీ పుష్పోత్సవాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటలతో స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఆలయంలోని అద్దాల మంటపంలో వివిధ రకాల పువ్వులతో అలంకరించిన ఊయలలో స్వామివారిని జోల పాటలతో శయనింపజేశారు. వందల మంది దంపతులకు దంపతి తాంబులాలు అందించారు. తీర్థ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ర్యాలీలో..

పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలిలోని జగన్మోహినీ కేశవస్వామి శ్రీపుష్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఉదయం వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రి స్వామివారికి శ్రీ పుష్పోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వైబీ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో పుష్పోత్సవం

రెండు వాహనాలను ఢీకొన్న మినీ లారీ

- ఎనిమిది మందికి గాయాలు
- స్తంభించిన ట్రాఫిక్



మినీలారీ డ్రైవర్‌ను బయటకు తీసుకువస్తున్న స్థానికులు



ప్రమాదంలో ఛిద్రమైన ఆర్టీసీ బస్సు ముందుభాగం

ఆలమూరు: జొన్నాడ – మండపేట రహదారిలోని ఎస్ మలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. వారిలో మినీలారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మినీ లారీ ధాన్యం లోడుతో తాడేపల్లిగూడెం నుంచి మండపేటలోని రైసుమిల్లుకు బయలు దేరింది. స్థానిక ఎస్ మలుపు వద్దకు వచ్చేసరికీ కాకినాడ నుంచి విజయవాడ వెళుతున్న అల్ట్రా లగ్జరీ బస్సును వేగంగా ఢీకొంది. దీంతో బస్సు అద్దాలు పగిలిపోయి ముందుభాగమంతా నుజ్జునుజ్జయ్యింది. మిని లారీ అదే వేగంతో జొన్నాడ వైపు వెళుతున్న లారీ వెనుక భాగాన్ని కూడా ఢీకొంది. ఈ ప్రమాదంతో మినీ లారీలోని డ్రైవర్, మండపేటకు చెందిన చింతలపూడి రాజు కేబిన్‌లో ఇరుక్కుపోయాడు. అతడి హాహాకారాలు విని స్థానికులు అక్కడకు చేరుకున్నారు. పగ్గాలు, గునపాల సాయంతో సుమారు గంట పాటు శ్రమించి అతడిని బయటకు లాగారు. ఈ ప్రమాదంలో రాజు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి.

ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తం

మినీ లారీ ఢీకొన్న వెంటనే విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ పి.సోమయ్య అప్రమత్తంగా వ్యవహరించాడు. బస్సును పక్కనే ఉన్న పంట కాలువ పక్కకు దింపడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ బస్సులో ప్రయాణిస్తున్న 28 మంది ప్రయాణికుల్లో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

నిలిచిన వాహనాలు

రోడ్డు ప్రమాదం కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. సుమారు కిలోమీటర్ మేర గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఆలమూరు ఎస్సై ఎల్. శ్రీను నాయక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కారు ఢీకొని మహిళ మృతి

తుని రూరల్: తుని మండలం ఎస్.అన్నవరం శివారున గల జీడిపప్పు పరిశ్రమ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణ నగర్‌కు చెందిన పి.రాము (68) అనే మహిళ మృతి చెందగా ఆమె సోదరి, ఇద్దరు కుమార్తెలు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ ఎస్సై రమేష్ బాబు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. సోదరి తంగెళ్ల సత్యవతి, కుమార్తెలు వి.సూర్యవతి, బందారు రాజేశ్వరితో కలసి పి.రాము వి.కొత్తూరులో బంధువు పెద కార్యానికి వెళ్లారు. మధ్యాహ్నం భోజనం అనంతరం తిరుగు ప్రయాణంలో నడిచి వస్తుండగా అన్నవరం నుంచి తుని వైపు వస్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో రాము మృతి చెందగా తంగెళ్ల సత్యవతి, వి.సత్యవతి, రాజేశ్వరి గాయపడ్డారు. వీరిని 108లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తంగెళ్ల సత్యవతిని కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ మరోసారి సీఎం కావాలంటూ యాగం



సుదర్శన యాగం నిర్వహిస్తున్న వేద పండితులు

మండపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు బుధవారం అర్తమూరులో మహా సుదర్శన యాగం ప్రారంభించారు. విశాఖపట్నానికి చెందిన వేద పండితుడు ఇలపర్తి భానువెంకటరత్నంశర్మ, ఆయన శిష్య బృందం ఈ యాగం నిర్వహిస్తున్నారు. శ్రీ లక్ష్మీనరసింహ మంటపం ఆరాధన, అప మృత్యుదోష పరిహారార్థం మృత్యుంజయ మహా సుదర్శన పూర్వక లక్ష్మీనరసింహస్వామి పూజ, ఆదిత్యాది నవగ్రహ పూజలను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు కర్రి పాపారాయుడు తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జగన్ విజయం కోరుతూ ఇటువంటి యాగం జరపడం ఇదే మొదటిసారి అన్నారు.

నిఘా బృందాల విస్తృత తనిఖీలు


అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం, ఓటర్ల ప్రలోభ పెట్టే వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ, ఎస్ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ నిఘా బృందాలు విస్తృత తనిఖీలు, దాడులు కొనసాగిస్తున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జిల్లాలో మంగళ, బుధవారాల్లో జరిగిన దాడులు, తనిఖీల్లో ఈ నిఘా బృందాలు మొత్తం రూ.25 లక్షలకు పైగా నగదు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ వివరాలను అమలాపురంలోని ఎస్పీ కార్యాలయం బుధవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది.

- నిఘా బృందాలు జిల్లాలో మంగళవారం దాడులు, తనిఖీలు నిర్వహించి రూ.17.71 లక్షలు, రూ.4,87,569 విలువైన 7.49 కేజీల వెండి ఆభరణాలను సీజ్ చేశాయి.
- ఇవే బృందాలు బుధవారం నిర్వహించిన తనిఖీలలో రూ.2.20 లక్షలను స్వాధీనం చేసుకున్నాయి.



రామచంద్రపురం నియోజకవర్గంలోని చెక్ పోస్టులో నగదును స్వాధీనం చేసుకున్న నిఘా అధికారులు

- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేటల్లో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దుల చెక్ పోస్టుల్లో తనిఖీలు జరిగాయి.
- రెండు రోజుల్లో నిఘా బృందాలు మొత్తం రూ.19.91 లక్షలు, రూ.4,87,569 విలువైన వెండి ఆభరణాలతో రూ.25 లక్షలకు పైగా సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ శ్రీధర్ ఈ ప్రకటనలో తెలిపారు.



కారును తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీరంగనాయకులు

కారులో రూ.లక్ష స్వాధీనం

ప్రత్తిపాడు: కారులో తరలిస్తున్న రూ.లక్ష నగదును బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తొండంగి మండలం పీఈ చిన్నయ్యపాలెం నుంచి రాజమహేంద్రవరానికి ములికి సత్యనారాయణ కారులో వెళుతున్నారు. స్థానిక జాతీయ రహదారిపై అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎం శ్రీరంగనాయకులు వాహన తనిఖీ చేపట్టగా రూ.లక్ష పట్టుబడింది. దానికి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని, రిటర్నింగ్ అధికారికి అప్పగించారు.

తనిఖీలలో రూ.లక్ష స్వాధీనం

అంబాజీపేట: గ్రామానికి చెందిన నిట్టాల రమేష్ అనే కొబ్బరి వ్యాపారి ద్విచక్ర వాహనంపై రూ. లక్ష తీసుకువెళుతుండగా బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేసింది. రమేష్ ఎటువంటి ఆధారాలు చూపించకపోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకుని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి అప్పగించారు.